# విశ్వామిత్రుడు

విశ్వామిత్రుడు వేద ఋషి. ఋగ్వేదం మూడవ మండలానికి కర్త. నదీ తీరాలలో నాగరికత విస్తరించాలని సూచించిన మహనీయుడు. వార్త్రతక ప్రభాత సంధ్యల మానవ కథ వికాస మెట్టేదో తెలిసినవాడు.

మేనమామ తన మేనల్లుని పల్లె తల్లి కన్నా ఎక్కువ బాధ్యత కలవాడట! ఎంతటి సాంఘిక న్యాయ నిర్మాణ చణుడు?
"విశ్వామిత్ర స్వరక్షతి బ్రహ్మేదం భారతం జనం"

"యజ్ఞ పశువు ఏమైనది?"

"మాయమైనది ప్రభూ!"

"అదెట్లు సాధ్యము?"

"కట్టుగొట్టాల నుండి ఎవరో విముక్తి కలిగించారు"

"దొంగతనమా?"

"ఋత్విక్కుల అనుమానం అదే!"

నా పరిపాలనలో దొంగతనమా? అయోధ్యా నగరానికి రాజును అయిన తరువాత ఇలాంటి వార్త ఎన్నడూ వినలేదు. ఆశ్చర్యమే!"

"ఆశ్చర్యం కాదు ప్రభూ! ఇది గొప్ప అపచారం. యజ్ఞ పశువు లేనిదే యజ్ఞం పరిసమాప్తం కాదు. అది శాపకారణం కదా! ప్రభువులు శాపగ్రస్తులు అవుతారేమో దేవరా! అందరూ దిగులు పడిపోతున్నారు".

లల్లాదేవి

"యజ్ఞ పరిసమాప్తికి మరొక దారి లేదా?" ఎంతో దిగులుతో ప్రశ్నించాడు అయోధ్యాపతి అయిన అంబరీషుడు.

అతడు ఉత్తముడైన పాలకునికి ఉండవలసిన లక్షణములన్నింటిని పుణికిపుచ్చుకున్నవాడు. సచ్ఛీలుడు. సద్వ్రతుడు. మంచి పాలకుడు.

ప్రజల మీద అపారమైన అనురాగము కలవాడు. ప్రజలందరి ప్రేమను నోచుకున్న మంచి ప్రభువు. అసత్యమనేది ఎరుగనివాడు. అనవరతము అన్నదాత. క్రతురతి కలవాడు.

పూర్ణాహుతికై నియమించిన యజ్ఞ పశువును యూపస్తంభానికి కట్టివేయగా దానినెవరో దొంగిలించారు. చారుల వార్తవిని అప్రతిభుడు అయ్యాడు అంబరీషుడు. ఋత్విక్కులు కల్పించుకున్నారు.

"దానునికి ఒక న్యాయము దేవరకు మరొక న్యాయము ఉండదుకదా దేవరా! యజ్ఞమునకై నియమించి యూపస్తంభమునకు చేర్చిన పశువు బలి ఈయవలసినదే! కానిచో యజ్ఞము పరిసమాప్తముకాదు. క్రతు కర్మకు అవాంతరమున్నచో అది ప్రళయము.

మామూలు మనిషి ఒక పనిని ప్రారంభించవచ్చు. మధ్యలో మానుకోవచ్చు. కాని సాక్షాత్తు ప్రభువులు ప్రారంభించిన యజ్ఞం మధ్యలో ఆగిపోతే ప్రజల మనోధైర్యం సడలిపోదా? కనుక ఓ రాజా! మీరు ప్రారంభించిన క్రతువు పూర్తికావలసిందే!

హోమధూమం తిరిగి మన హిమాలయవీధులు ఎగురవలసిందే! అవాంతరాలకు భయపడి వెనుకంజ వేసే ప్రభువు పిరికివాడు. అట్టివాడు ప్రజలకు భూమికి దుర్భరమైనవాడు.

అవాంతరాలకు జడియక ప్రారంభించిన యాగాన్ని పరిసమాప్తం చేయండి "ఇది మా ఆజ్ఞ " అంటూ ప్రవచించారు యజ్ఞ కార్యం చేయించవచ్చిన ఋత్విక్కులు.

"యూప స్తంభానికి కట్టిన పశువును దొంగిలించిన పాపి ఎవరై ఉండవచ్చు?" అంబరీషుడు ప్రశ్నించాడు.

"ఇంకెవరు? దేవేంద్రుడే! ఎవరు చేసినా వారి నూరవ యజ్ఞానికి అభ్యంతరాలను కల్పించడం అతనికి ఆనవాయితే కదా!"

"స్వయంగా దేవేంద్రుడే దొంగిలించాడు కదా! తిరిగి దానిని ఎవరు తీసుకురాగలరు?"

"బహుశా ఆ ప్రయత్నానికి సమయం చాలదు".

"మరి ఏమి చేయాలని మీ ఆదేశం"

"ఓయీ క్రతుకర్తా! తనంత తానుగా ఇష్టపడి తల్లిదండ్రుల అంగీకారాన్ని సంపాదించిన బాలకుడు ఎవడైనా యూప స్తంభానికి కావలించుకోవాలి.

ప్రతికరణ శుద్ధిగా అగ్నిదేవునికి తనువు ఆహుతి చేయాలి. అప్పుడు యజ్ఞం పరిపూర్తి అవుతుంది"

"శివశివా! నేను విన్నది నిజమా? నరబలి ఇమ్మంటారా?" అంటూ చెవులు మూసుకొని ఋత్విక్కుల వంక దీనంగా చూశాడు అయోధ్యాధిపుడు అంబరీషుడు.

అతడు సూర్యవంశజుడయిన క్షత్రియుడు. తన పాప భయానికి ఒక అమాయక బాలుణ్ణి బలి చేయడమనడం అయిన గుండెల్ని కోత పెట్టింది.

"ఓయీ రాజేంద్రా! తనంత తానుగా నిర్ణయించుకుని తల్లి అనుమతి పొందిన వటువు ఎనిమిది సంవత్సరాల వాడైనా సన్యాసి కాగలడు కదా!

పరలోక సంపాదనకై జీవిత సుఖాలన్నింటిని వదులుకోవడం వేద విహితమే కదా! అయినప్పుడు అదే పద్ధతిలో జీవిత సుఖాలనేకాక జీవితాన్నే వదులుకోవడం పాపం ఎలా అవుతుంది?" అని ప్రశ్నించారు ఋత్విక్కులు.

"అయినా మానవతకు కళంకం వచ్చే పనిని నేను చేయలేను" అన్నాడు అంబరీషుడు.

రాజు సర్వస్వతంత్రుడేకాని ప్రజాహితం విషయంలో అతడు అనేక విధాల నిబద్ధుడు.

ఇప్పుడు నీవు రాజ్యంలోని ప్రజల శ్రేయస్సుకై యజ్ఞ కర్మ ప్రారంభించావు. దురదృష్టవశాత్తు యజ్ఞ పశువు పోయింది. ఇప్పుడు యజ్ఞాన్ని అర్ధంతరంగా ఆపివేశావనుకో! అది పాప హేతువు.

రాజు చేసే పాప కార్యం రాజుకే కాదు. ప్రజలకు కూడా కీడు చేస్తుంది. కనుక నీవు యజ్ఞకర్మను ఆపుచేయలేవు. పూర్తిచేసి తీరవల

సిందే!

ప్రజాహితం కోసం నీవు నరకానికి పోయినా పాప కార్యం అయినా చేయవలసిందే! లేకపోతే అయోధ్యా వాసులంతా చిత్రహింసలకు గురి అవుతారు.

కనుక లాభనష్టాలను గణించక యూప స్తంభాన్ని కావలించుకుని అగ్నిదేవునికి ఆహుతికాగల బాలకుని కోసం ప్రయత్నించవయ్యా!

ఎక్కువ సమయంలేదు. వెంటనే బయలుదేరు'' అంటూ తొందరించారు వేదవిదులు!

అంబరీషుడు అవాక్కు అయిపోయినాడు.

* * *

అశ్వాలు ప్లుతగతిలో పరుగులు తీస్తున్నాయి. అది అరణ్య ప్రాంతం. అప్పటికే అంతా అలసిపోయారు. యూపాన్ని కావలించుకుని యజ్ఞ పశువుకాగల బాలకుని కోసం వెదికివెదికి అలసిపోయింది అంబరీషుని అనుచర వర్గమంతా! విశ్రాంతికోసం ఎదురుచూస్తున్నారు. "ఈ తెరువు ఎవ్వరిదో కాని చాలా ప్రశాంతంగా ఉంది'' అన్నాడు అంబరీషుడు అశ్వాన్ని నిలుపు చేసి.

''దేవరా! ఇది ఋచీకుని ఆశ్రమం. అతనికి ఒక భార్య, ముగ్గురు సంతానం. ముగ్గురూ మగబిడ్డలే!'' అంటూ సమాచారం అందించారు అనుచరులు.

''అయితే మేము తక్షణం వారిని సందర్శించాలి. వారి ఆశ్రమానికి దారితీయండి'' అన్నాడు అంబరీషుడు.

ఋచీకుని ఆశ్రమం అందాల పాలవెల్లి! ప్రశాంతి నిలయం. పవిత్ర ఋషి వాటికలా ఉంది.

రాజ కు స్వాగతం పలికేందుకు ఆశ్రమం వెలుపలకు వచ్చాడు ఋచీకుడు.

''రాజేంద్రా! ఈ వనభూమికి స్వాగతం'' అన్నాడు. అశ్వాన్ని దిగి అతనికి పాదాభివందనం చేశాడు రాజు! అతని పాద అంగుళులకు నెన్నుదురు సోకించి మొక్కాడు.

ఋచీకుడు రాజు పట్ల ప్రసన్నతా భావం చూపించాడు.

''ఋషీ! ఆశ్రమ వాసుల సుఖ జీవనం చూడవలసిన బాధ్యత నాకుంది. మీకు లోటు ఏదైనా ఉంటే చెప్పండి''

''రాజా! నీ పాలనలో ప్రజలకు దినవెచ్చాలు సక్రమంగా పంపిణీ అవుతున్నాయి. రాజు అంటే బిడ్డల ఆకలి తీర్చే తల్లివంటివాడని నిరూపించావు. ధన్యుడవయ్యా! చరిత్రలో నీవొక ఆదర్శ పురుషుడుగా నిలిచిపోగలవు''

''ఋషీ! మీ ఆశీస్సులే నా సంపద! నాకు శక్తి! కాని విధి వశాన నేనొక సమస్యలో చిక్కిపోయాను''

''అవునయ్యా! విధికీ, నదికీ ఎవరూ ఎదురీదలేరు. ఏమిటయ్యా నీ సమస్య?'' అని అడిగాడు ఋచీకుడు.

''యజ్ఞ కార్యానికి విఘ్నమైంది. యజ్ఞ పశువుపోయింది''

''దేవేంద్రుడే ఈ పని చేసివుంటాడు. ఇప్పుడేమి చెయ్యాలనుకుంటున్నావు. క్రతు విఘ్నం పాపహేతువు కదా!''

''అందుకే మార్గాంతరం చూపమని ఋత్విక్కుల్ని అడిగాను''

''తనకు తానుగా వచ్చి తల్లిదండ్రుల అనుమతికూడ ఇచ్చిన బాలకుణ్ణి యజ్ఞపశువుగాఅగ్నిదేవునికి సమర్పించుకోమని వారు చెప్పి ఉంటారు అవునా?''

''అలాగే చెప్పారు. నాకు సంతానం లేదు. అలా వచ్చే బాలకుని కోసం అన్వేషిస్తూ బయలుదేరాను. మీకు ముగ్గురు మగబిడ్డలు ఉన్నారని విని మీదగ్గరకు వచ్చాను. అన్నీ తెలిసినవారు కదా మీరు!

ఇది నా స్వార్థం కాదు. రాజు క్రతు విఘ్నం చేస్తే ఆ పాపం రాజ్య ప్రజలను చుట్టుకుంటుంది''

అంబరీషుని మాటలు విని క్షణంపాటు మౌని అయినాడు ఋషి! రాజు అంజలి ఘటించి నిలిచి ఉన్నాడు. అంబరీషా! యజ్ఞమనేది పవిత్ర కార్యం. రాజ్య ప్రజల క్షేమం కోరి చేసే యజ్ఞాలు మరింత పవిత్రమైనవి. వాటి పరిసమాప్తికి ఎవరైనా ఎలాంటి త్యాగమైనా చేయడానికి సిద్ధంగా ఉండాలి.

నాకు ముగ్గురు మగబిడ్డలు ఉన్న మాట యథార్థం! కాని నేను తండ్రిని కదా! పెద్దవాడి చేత తలకొరివి పెట్టించుకోవాలనే స్వార్థం నాకుంది. అందువల్ల పెద్ద బిడ్డను ఇచ్చుకోలేను'' అన్నాడు ఋచీకుడు.

మిగిలిన ఇద్దరిలో ఏ ఒకరినైనా కోరుకోమని అర్థాపత్తిలో సూచించాడు ఋషి. అది విని రాజు హృదయం ఆనంద డోలిక అయింది.

ఈ మాటలను వంట ఇంటి తలుపు చాటున పొంచి వింటున్న ఋచీకుని ధర్మపత్ని నిలువరించుకోలేకపోయింది. మెరుపులా వారి మధ్యకు వచ్చింది.


''రాజా! మీకు తెలియని ధర్మాలేమున్నాయి. తండ్రికి పెద్దబిడ్డ మీద మమకారం ఎక్కువ. అలాగే తల్లిని అయిన నాకు చిన్నవానిమీద ప్రేమ అధికం'' అంటూ తన మనస్సు బయట పెట్టుకుందామె.

మధ్యముడు అయిన శునశ్శేపుడు అక్కడే కూర్చుని తల్లిదండ్రుల మాటలు విన్నాడు. వెంటనే లేచి ముందుగా తల్లికి, తరువాత తండ్రికి మొక్కాడు.

నేరుగా వచ్చి రాజు ఎదుట నిలిచాడు.

''అంబరీషా! నా తల్లిదండ్రుల మాటలు విన్నారు కదా! పెద్దవాడు తండ్రికి ప్రేమపాత్రుడు. కనిష్టుడు తల్లికి ప్రేవులు కట్టిన మూట! నేను మధ్యముడను.

నా మనః పూర్వకంగా యజ్ఞ పశువును అవుతాను. నన్ను తమవెంట తీసుకుపొండి. యూపస్తంభాన్ని కావలించుకుని అగ్నికి ఆహుతి అవుతాను.



అందువల్ల తల్లిదండ్రులకు బాధలేదు. రాజుకు మంచి యోగం. రాజ్యానికి క్షేమం. నాకు స్వర్గలోక ప్రాప్తి. అంతా మంచి జరుగుతుంది. నన్ను మీవెంట తీసుకుపోయి అగ్నికి ఆహుతి చేయండి'' అన్నాడు.

అతని మాటలు రాజుకు కన్నీరు తెప్పించినాయి. తలదించుకుని అశ్వదళం వైపు నడిచాడు అంబరీషుడు.

మధ్యముడు అయిన శునశ్శేపుడు అనుసరించాడు.

** ** **

నడిమింట మార్తాండుడు ప్రజ్వరిల్లుతున్నాడు.

అంతకన్నా ప్రకాశమూర్తి అయి భాసిల్లుతున్నాడు గాధేయుడైన విశ్వామిత్ర బ్రహ్మర్షి! అతడు వేద ఋషి.

ఋగ్వేదంలోని పదవ మండలానికిది నిర్మాత. కూష్మండ కనములు (కుషాన్ కనుములు) కు ఇంకా పశ్చిమ ప్రాంతాల (ఇప్పటి ఆఫ్ఘనిస్తాన్) నించి వలస వచ్చినవాడు. ఆర్యావర్తంలోని నదీ తీరాలలో నాగరికత పరిఢవిల్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నాడు. అతడు శునశ్శేపునికి సాక్షాత్తు మేనమామ.

ఆయన కన్పించగానే శునశ్శేపుడు దుఃఖ భారాన్ని ఆపుకోలేకపోయినాడు. పరుగున వచ్చి కౌశికుని పాదాలను ఆశ్రయించి కన్నీరు మున్నీరుగా విలపించాడు.


లేచివెళ్ళి మహర్షి ఒడిలో కూర్చున్నాడు.

నాయనా! నీ దుఃఖానికి కారణం ఏమిటి?'' అని ప్రశ్నించాడు గాధేయుడు కరుణా సముద్రుడై!

''మామా! నేను ఎండలో చాలా దూరం నడిచి వచ్చాను. ఎండ వలన దప్పిక ఎక్కువగా అయింది. అదే నా దుఃఖానికి కారణం'' అని బదులు చెప్పాడు బాలకుడు.

తన ఒడిలో కూర్చున్న అతని శరీరాన్ని తడిమి చూశాడు విశ్వామిత్రుడు! వాడి శరీరంలో ఉన్న రక్తమాంసాలకు తన శరీరంలోని రక్తమాంసాలకు విరాట్ (తాత) ఒక్కడే!సమ్రాట్ (తండ్రులు)లు వేరు కావచ్చు. అది రక్తమాంసాల పాశం. ఆత్మీయతా బంధం!

సాక్షాత్తు తన సోదరికి అతడు తనూభవుడు. ఆర్యావర్తంలో పవిత్రమైన నదుల వలె కొన్ని వంశాలు పరిఢవిల్లుతున్నాయి. ప్రవహించే నదుల జీవజలాల మీది అలలవలె కొన్ని తరాలు వస్తూ పోతూ ఉన్నాయి. ఇది ఈతరం వారి మమతానురాగం.




తన సోదరి శరీరంలోంచి పుట్టినవాడు తన శరీరంలోంచి పుట్టిన వానికన్నా అధికుడే అనుకోవాలి. అలాకానప్పుడు సమిష్టి జీవితానికి ప్రధాన స్రోతం తెగిపోయినట్లే! ''ఓయీ! బుడతా! శునశ్శేపుడా! నీ తల్లికి నీ మీద ఎంత ప్రేమ ఉన్నదో తెలుసుకదా! మేనమామను అయినందుకు అంతకన్నా అధికంగా నేను నిన్ను ప్రేమించాలి! ప్రేమ వాత్సల్యాలు వర్షించే తల్లిదండ్రులలో ప్రథమ స్థానం తల్లిదేనని వేదాలు చెబుతున్నాయి. అలా అయినప్పుడు ఆ తల్లి సోదరుడు నీ తండ్రికన్నా అధికంగా ప్రేమ పాత్రుడని నువ్వు గుర్తించాలి!

నా దగ్గర ఏమీ దాచకు మరి. నీ తల్లి శరీరంలోంచి నువ్వు పుట్టావు. మేమిరువురం ఒక శరీరంలోంచి పుట్టాం. కనుక మనది ఒకే రక్తం. ఒకే మాంసం. ఒకే ఆత్మ. కన్న తండ్రి మేనమామ కంటే పరాయివాడు! తెలిసిందా? నీ దుఃఖానికి కారణం మార్గాయసమూ కాదు. దప్పిక అధికంగా అనటమూ కాదు. అసలు కారణం ఏమిటో వాస్తవాన్ని నాకు వివరించు.

నీ తల్లి నుంచి నీవు దాచుకోగలిగినది ఏమైనా ఉంటే నానుంచి కూడా దాచుకో'' అన్నాడు వాత్సల్యం నిండిన కంఠస్వరాన. ఆత్మీయత నిండిన ఆ మాటలు శ్రావణమేఘాలను శీతవాయువులు తాకినట్లుగా బుడుతని గుండెల్ని తాకినాయి.

అతడు బావురుమని విలపించడం ప్రారంభించాడు. చెలియలికట్టను దాటివచ్చే సముద్ర జలంలా కన్నీరు రెప్పలు దాటి వర్షించినాయి.

''నాయనా దుఃఖ కారణం చెప్పు'' అన్నారు బ్రహ్మర్షి.

''మామా! పెద్దబిడ్డ తండ్రికి ప్రేమ పాత్రుడట. చిన్నబిడ్డ తల్లికి అపురూపమట. మధ్యముడను కదా! మరి నా గతి ఏమిటి? నన్ను అంబరీషుని యజ్ఞపశువుగా అప్పగించారు. ఇప్పుడు నాకేమిటి దారి?'' విశ్వామిత్రుని మెడను కావలించుకున్నాడు శునశ్శేపుడు.

కౌశికుని గుండెలు ద్రవించినాయి. తన ముత్తాత అయిన ఇషీరథుడు బహుకాలం జీవించారు. తాతగారైన కుశికుడు మరెంతో కాలం జీవించాడు. తండ్రిగారైన గాధి పుష్కలమైన ఆయుర్దాయాన్ని అనుభవించాడు. వారంతా కలిసి ఎంతకాలం జీవించారో అంతకన్నా ఎక్కువ కాలం తాను తపోచర్యలో వెచ్చించాడు.

ఇంతకాలంలో తానెన్నడూ వినలేదు. కనలేదు. కన్నబిడ్డను యజ్ఞ పశువుగా ఇవ్వడం ఏమిటి?

''ఓయీ! ఇలా ఎందుకు జరిగింది?''

''రాజు నా తండ్రికి నూరువేల కదువులను సమర్పించాడు''

''ఓహో సంపదల మీది వ్యామోహం కాబో

**భయం**

డాక్టరుగారూ మొదటిసారిగా ఆపరేషన్ చేయించుకుంటున్నాను. భయంగా ఉంది సార్ అన్నాడు పేషెంట్.

''మొదటిసారిగా నేనూ ఆపరేషన్ చేస్తున్నా నాకు లేని భయం నీకెందుకయ్యా'' అని కసురుకున్నాడు డాక్టర్.

—ఎం.సురేంద్రరెడ్డి
కొంకుదురు.

ఎ. నాయనా భయపడకు నీకు నేనున్నాను'' అంటూ అభయం ఇచ్చాడు విశ్వామిత్రుడు. అతని అభయం పెట్టనికోట!

కొండచాటు నీడ వంటిది అది! వెంటనే ప్రథమ ప్రయత్నంగా తన బిడ్డలందరిని పిలిచాడు విశ్వామిత్రుడు.

అంధకాదులంతా వచ్చి చేతులు కట్టి నిలిచారు ఎదుట. ''నాయనలారా! నా మేనయల్లుడు ప్రాణాపాయంలో పడిపోయినాడు. తల్లి తరువాత తల్లి అంతటివాడు మేనమామ.అతనిని రక్షించుకోవడం నా ధర్మం. మీరు నూరు మంది ఉన్నారు కదా!? ఒకరు ఇతనికి బదులుగా యజ్ఞ పరిసమాప్తికి ప్రాణత్యాగం చేయండి. నేను సంతుష్టుడను అవుతాను'' అన్నాడు. అందుకు కౌశికేయులంతా పెద్ద పెట్టున నవ్వారు. తండ్రీ! అతనికోసం మాలో ఏ ఒక్కరూ ప్రాణత్యాగం చేసేందుకు సిద్ధంగా లేరు'' అని తిరస్కరించారు.

అందుకు విశ్వామిత్రుని కన్నులు ఎర్రవారినాయి.

''ఓరీ! అవునని నేను అన్నదానిని కాదని మీరు అంటారా? ఒకరి ప్రాణం రక్షించేందుకు ఆత్మత్యాగం చేయడం దయ. తండ్రి మాట వినడం మీ ధర్మం.

మీరు దయకు, ధర్మానికి కొరగానివారై నా మాటలను తిరస్కరించారు. కావున దక్షిణావనికి వెళ్ళి దండకారణ్యంలో కృష్ణ గోదావరి నదుల మధ్య బురద భూములలో బ్రతకండి. ఇది మీకు శాపం!

నా మాట కాదన్నారు కాబట్టి మీరింక కౌశికేయులని కాని, గాధేయులనికాని, వైశ్వామిత్రులనికాని పిలువబడేందుకు అనర్హులు!

మీలో పెద్దవాడైన అంధకుని పేరుమీదుగా కాలజలధిలో భావితరాలకు పయనిస్తారు.

నేను అభయమిచ్చిన ఈ శునశ్శేపుని ఎలా రక్షించుకోవాలో నాకు తెలుసు'' అంటూ వారిని శపించాడు బ్రహ్మర్షి.

అంధకాదులంతా కృష్ణా గోదావరి నదుల మధ్య బురద భూములకు ప్రయాణమైనారు.

శునశ్శేపుని వెంట పెట్టుకుని అంబరీషుని యజ్ఞవాటికను చేరుకున్నాడు బ్రహ్మర్షి! విశ్వామిత్రుడు వచ్చినాడని వినగానే ఋత్విక్కులంతా ఎదురువచ్చి స్వాగతం పలికారు. ఉచితాసనం ఇచ్చారు. తనకుతానే అగ్ని శీతలం అయ్యేందుకు ఒక మంత్రాన్ని (రహస్యాన్ని) ఉపదేశించాడు బ్రహ్మర్షి.

(''ఇమమ్మేవరుణ'' అనే ఋశ్వాద మంత్రంలో అగ్నిని శీతలీకరించే భౌతికశాస్త్ర రహస్యాన్ని నిక్షిప్తంచేసి ఉంచాడు బ్రహ్మర్షి విశ్వామిత్రుడు—లల్లాదేవి).

దాని సాయంతో యూపస్తంభాన్ని దహించిన అగ్ని శునశ్శేపుని దహించలేకపోయింది. యజ్ఞపశువు అర్పణ జరిగింది కాబట్టి యజ్ఞం పరిసమాప్తి కూడా జరిగినట్లే అయింది.

(అగ్నిలో దుమికినా కాలిపోకుండా ఉండే రహస్యాన్ని ఆ తరువాత మైథిలికి కూడా బోధించాడు బ్రహ్మర్షి విశ్వామిత్రుడు).

ఈ కథ అంతా విని పరుగు పరుగున వచ్చారు శునశ్శేపుని తల్లిదండ్రులు. కాని బ్రహ్మర్షి వారికి బిడ్డను అప్పగించలేదు. అగ్నిపునీతుడైన మేనయల్లునికి బ్రహ్మోపదేశం ఇచ్చి తపోచర్యకు అనుమతి ప్రసాదించాడు బ్రహ్మర్షి విశ్వామిత్రుడు!!

